పెండింగ్ పనులు పూర్తి చేయిస్తా..

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, జూలై 3 : కాలనీల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులను కల్పిస్తానన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో శ్మశానవాటిక అభివృద్ధి, ట్రాన్స్‌ఫార్మర్ల, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణం, తాగునీటి వ్యవస్థ మెరుగుకోసం ఎమ్మెల్యే గాంధీని బుధవారం ఆయన నివాసంలో కలుసుకుని వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోట్లాది నిధులు వెచ్చించి విస్తృతంగా మౌలిక వసతులను కల్పించామన్నారు. నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చేపట్టాల్సిన పనులతోపాటు కాలనీలలో పెండింగ్‌లో ఉన్న పనులన్ని పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. సౌకర్యవంతమైన రహదారులు, సమృద్ధిగా తాగునీరు, మెరుగైన విద్యుత్ వసతులను కల్పిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. నిధుల కోసం ప్రభుత్వంతో పోరాడుతామని, ప్రజా సౌకర్యానికి పెద్దపీట వేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ధాత్రినాథ్ గౌడ్, కాలనీ వాసులు నాగరాజు, గోపాల్, కేశవ్, బాబీ, సీతారం, నరేశ్, మహేందర్, యాదయ్య, చంద్రశేఖర్, రవి, కమలేశ్, రవి, రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న హఫీజ్‌పేట్ డివిజన్ అంబేద్కర్‌నగర్ వాసులు

ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రం ఇస్తున్న నానక్‌రాంగూడ ఎస్సీ కాలనీవాసులు

పాఠశాలలో వసతుల ఏర్పాటుకు కృషి

శ్రీనివాసనగర్ పాఠశాలలో నేతలు, ఉపాధ్యాయులు

జగద్గిరిగుట్ట, జూలై 3 : జగద్గిరిగుట్ట డివిజన్‌లోని శ్రీనివాసనగర్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయిస్తానని కార్పొరేటర్ జగన్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులతో బుధవారం సమస్యలపై చర్చించారు. ప్రహరీ, మరుగుదొడ్లు, ఆట స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు ప్రస్తావించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే మెరుగైన వసతులు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, చంద్రకళ, శైలజ, గాయత్రి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

ప్రజలు దళారులను ఆశ్రయించవద్దు

జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్

మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లేశ్

జీడిమెట్ల, జూలై 3 : ప్రజలు నేరుగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ వచ్చి తనను సంప్రదించవచ్చునని, మధ్య దళారులను ఆశ్రయించవద్దని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. బుధవారం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి సాధ్యమన్నారు.డ్రగ్స్, గంజాయి అమ్మకాల సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో సమీక్ష

అల్లాపూర్,జూలై3: అల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం అన్ని శాఖల అధికారులతో డివిజన్ అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక కార్పొరేటర్ సబీహాబేగం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, డివిజన్‌లో నెలకొన్న పెండింగ్ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన అసోసియేషన్ సభ్యులు, అనుబంధ కమిటీ సభ్యులు హాజరుకావాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి

మియాపూర్, జూలై 3: శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తగినన్ని నిధులను కేటాయించి తోడ్పాటునందించాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. బుధారం ఆయన సచివాలయంలో కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ అవసరాలను గుర్తించి తీర్చే విధంగా ప్రణాళికలు రూపొందించేలా అధికారులను ఆదేశించాలని, ఐటీ పరిశ్రమలకు వేదికగా ఉన్న శేరిలింగంపల్లిని అభివృద్ధిలో అగ్రభాగంలో నిలిపేలా సహకరించాలని జగదీశ్వర్‌గౌడ్ కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్,జూలై 3: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని న్యూశివాలయనగర్‌లోని అంబేద్కర్‌భవన్‌కు వెళ్లేదారిలో ఆర్యన్‌వైన్స్ సమీపంలోని రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు మృతుడి వివరాల కోసం పరిసర ప్రాంతాల్లో ఆరా తీయగా.. ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసిన పోలీసులు, శవాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కాగా, మృతుడి వయస్సు 45-50 ఏండ్ల మధ్య ఉంటుందని, ఒంటిపై బ్లూకలర్ జీన్ ప్యాంట్, తెలుపు, నలుపు రంగు కలిగిన పూలచొక్కా ధరించడంతోపాటు తలకు నలుపురంగు టోపీ ధరించిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే సూరారం పీఎస్‌లో తెలియజేయాలని కోరారు.

సర్కిల్‌లో నాలుగు ప్రజాపాలన సేవా కేంద్రాలు


ప్రజాపాలన పోర్టల్‌లో సేవలు పరిశీలిస్తున్న డీసీ వంశీకృష్ణ

మియాపూర్, జూలై 3 : బల్దియా కమిషనర్ జోనల్ కమిషనర్‌ల ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్‌లో నాలుగు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. ఈ కేంద్రాలు గురువారం నుంచి తమ సేవలందిస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం డీసీ విలేకరులతో మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్‌లలోని వార్డు కార్యాలయాల్లో ఈ-సేవ కేంద్రాలను ఏర్పాటు చేశామని, సేవలందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇటీవల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజలు పథకాలపై అందించిన దరఖాస్తుల పురోగతిని పరిశీలించుకోవడంతోపాటు పొరపాట్లను సేవ కేంద్రాలలో సవరించుకోవచ్చని డీసీ తెలిపారు. సేవ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ మరో అధికారి అందుబాటులో ఉంటారని, ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రంలో సేవలు పొందవచ్చున్నారు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుదారులు వాటి పునః పరిశీలన, సవరింపుల నిమిత్తం గతంలో ఇచ్చిన దరఖాస్తు నంబర్, ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డుల్లో ఏదేని ఒక ఆధారాన్ని వెంట తీసుకెళ్లాలని డీసీ సూచించారు.

కుత్బుల్లాపూర్‌లో రైల్వే సమస్యలపై జీఎంకు వినతి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా వెంటాడుతున్న రైల్వే విభాగం పరిధిలోని సమస్యలపై బుధవారం బీజేపీ శ్రేణులు సికింద్రాబాద్ రైలు నిలయంలోని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. సుచిత్ర రైల్వేస్టేషన్‌కు సుచిత్ర ప్రధాన చౌరస్తా నుంచి రోడ్డు సౌకర్యం, ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులకు అదనపు ఎంఎంటీఎస్ రైళ్ల సంఖ్యను పెంచాలని, కొంపల్లి అండర్‌పాస్ రోడ్డు, అయోధ్య ఎక్స్‌రోడ్డు వద్ద మేడ్చల్-మియాపూర్ రోడ్డుపై రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్య, ప్రయాణికుల సౌకర్యం అండర్‌పాస్ ఆర్ఓబి నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి డా.ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌యాదవ్, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, పార్టీ కోకన్వీనర్ శివాజీ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, గరిగే శేఖర్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీశ్‌సాగర్, చండి శ్రీనివాస్, ప్రసాద్, చక్రాధర్ తదితరులు పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్, జూలై 3

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు నిలిపివేయాలి

గాజులరామారంలో పర్యటించిన రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ రంగనాథ్

పరికి చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న రంగనాథ్ తదితరులు

దుండిగల్, జూలై 3: రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ రంగనాథ్ బుధవారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గాజులరామారం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 299, 300, 301, 298, 295లలోని భూములను పరిశీలించారు. అదే విధంగా సర్వే నంబర్ 298, 299, 300, 301లోని పరికి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో చేపట్టిన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని మన్‌భూం నిర్మాణ సంస్థకు సూచించారు. భూములను పరిశీలించిన వారిలో రంగనాథ్‌తో కుత్బుల్లాపూర్ తాసీల్దార్ రెహమాన్‌తోపాటు గాజులరామారం సర్కిల్ డీసీ మల్లారెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

టీజీఐఐసీ జీఎంకు శుభాకాంక్షలు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేడ్చల్ సిద్దిపేట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ మండే అనురాధను బుధవారం జేఎన్ఎంఐఎస్ఎస్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ఇండస్ట్రీయల్ పార్కును అభివృద్ధి చేయాలని వారు ఆమెను కోరారు. కార్యక్రమంలో సర్వీస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – జీడిమెట్ల, జూలై 3

– కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి ముత్తుకు కూకట్‌పల్లి శక్తిపురం ఇండస్ట్రీయల్ అసోసియేషన్ నేతలు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శీరం జగ్గారావు, మధుసూదన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మహాదేవయ్య, అకృతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

– కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి ముత్తుకు రెయిన్‌బోవిస్తాస్ రాక్‌గార్డెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి మధుసూదన్ రెడ్డిపుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు రామ్, ప్రమోద్‌రెడ్డి, ప్రసాద్, శ్రీపాద్, పూసపాటి దీప్తిలు ఉన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 3

బాధ్యతగా పరిసరాలు బాగు చేసుకుందాం

అధికారులతో కలిసి పర్యటిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

జడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూలై 3 : పరిసరాల పరిశుభ్రత విషయంలో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో విధుల నిర్వహణతోపాటు ప్రజల తోడ్పాటు ఎంతో అవసరమని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదర్శజోన్‌గా తీర్చిదిద్దుకునేలా అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని పటాన్ చెరు ఆర్‌సీపూర్ సర్కిల్‌లో జడ్సీ ఉపేందర్‌రెడ్డి బుధవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా కాకతీయనగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ ప్రాంతం, బాక్స్‌డ్రైన్, రాయసముద్రం చెరువు, బాల విహార్ పార్కు, రైతుబజార్, బాంబేకాలనీ కమ్యూనిటీహాల్, మ్యాక్స్ సొసైటీ సహా ఇతర ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా ఉన్న సమస్యలు పరిశీలించారు. ఈసందర్భంగా జడ్సీ మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణకు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. నిర్మాణ వ్యర్థాలు సహా రోజు వారీ పోగయ్యే చెత్త రహదారులపై పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, అధికారులు పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ముంపు సమస్యల్లేకుండా బాక్స్ డ్రైన్ నాలాల నిర్మాణాలను చేపట్టాలని జడ్సీ పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. విధుల పరంగా ఎటువంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని జడ్సీ ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీ సురేశ్ ఇతర అధికారులున్నారు.



మల్లంపేట్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

దుండిగల్,జూలై 3 :దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా వెలసిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి జీ+2 లేదా స్టిల్ట్+2 అంతస్థులకు అనుమతులు తీసుకుని అంతకు మించి అంతస్థులు నిర్మిస్తున్న నిర్మాణాలతోపాటు మున్సిపాలిటీ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గడిచిన రెండు రోజులుగా అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. బుధవారం మల్లంపేట్‌లోని ఓఆర్ఆర్ సమీపంలో వెలసిన కమర్షియల్ భవనంతోపాటు మల్లంపేట్ వైపు నుంచి ఖాజీపల్లి వెళ్లే రోడ్డులో నిర్మిస్తున్న మమో బహుళ అంతస్థుల భవనంలోని పలు స్లాబులను బ్రేకర్లతో కూల్చివేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతూనే ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. ఈ కూల్చివేతల్లో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, టౌన్‌ప్లానింగ్ అధికారి సంజనతోపాటు పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లంపేట్‌లోని అనుమతి లేకుండా వెలసిన ఓ భవనంలోని శ్లాబ్‌ను కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల తవ్వకాలు!

- దూలపల్లిలో శరవేగంగా ఓ బహుళ నిర్మాణ పనులు
- టిప్పర్ల ద్వారా మట్టి తరలింపు.. ట్రాఫిక్‌కు అంతరాయం
- చోద్యం చూస్తున్న కొంపల్లి మున్సిపాలిటీ యంత్రాంగం

దూలపల్లిలో మహాలక్ష్మి ఎస్టేట్‌కు వెళ్లేదారిలో బహుళ నిర్మాణం సెల్లార్ కోసం మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

కుత్బుల్లాపూర్, జూలై 3: వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ప్రభుత్వ యంత్రాంగం సెల్లార్లు, మట్టి తవ్వకాలు చేపట్టరాదని ఆదేశాలు జారీ చేసింది. వీటిని అమలు చేయాల్సిన క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘనకు గురవుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలో మహాలక్ష్మి ఎస్టేట్‌కు వెళ్లేదారిలో ఓ బహుళ నిర్మాణం కోసం సెల్లార్ తీసేందుకు జేసీబీ యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. దాదాపుగా దానికి ఆనుకొని ఇతర నిర్మాణాలు కూడా ఉన్నాయి. జేసీబీలతో తవ్వకాలు చేపట్టిన మట్టిని అక్కడి నుంచి ఇతర చోటకు తరలించేందుకు పదుల సంఖ్యలో టిప్పర్లు నడుస్తున్నాయి. ఇటు నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టడమే కాకుండా అటు సమయాపాలన లేకుండా దూలపల్లి నుంచి నర్సాపూర్ రాష్ట్ర రహదారిని కలిపే రోడ్డు మార్గంలో టిప్పర్ల రాకపోకలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు, టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం ఇవేమి పట్టనట్లుగా వ్యవహరించడం పట్ల నిర్మాణదారులకు మరింత బలం చేకూరుతుందని, పలువురు అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రెయిన్ సీజన్ కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఈ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, నిర్మాణదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

వర్షాకాలంలో ఇలాంటి పనులు చేయకూడదని జీఓ ఉన్నది. వీటికి విరుద్ధంగా చేపడుతున్న వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాల్సిందే. పనులు నిలిపివేసి నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తాం.

– శ్రీహరి, కమిషనర్, కొంపల్లి మున్సిపాలిటీ

భయంతో ఒకరు..మనస్తాపంతో మరొకరు ఆత్మహత్యాయత్నం

పోలీసులు బెదిరించలేదని డీసీపీ ముందు వివరణ ఇచ్చిన వాచ్‌మన్ కుటుంబసభ్యులు

వివరాలు వెల్లడిస్తున్న చిత్తారపు లక్ష్మి,సుధ

దుండిగల్, జూలై 3 : దొంగతనం కేసులో పోలీసులకు భయపడిన వాచ్‌మన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎపిసోడ్‌లో బుధవారం మరో ట్విస్ట్‌కు దారితీసింది. నేరాన్ని ఒప్పుకోవాలని పోలీసులు తమను ఒత్తిడి చేయలేదని, రాజేశ్ పురుగుల మందు తాగడానికి, పోలీసులకు ఎటువంటి సంబంధంలేదని వాచ్‌మన్ కుటుంబం పేర్కొనడం అనుమానాలకు తావిస్తున్నది. ఇదిలా ఉంటే చిత్తారపు లక్ష్మి భర్త తాతారావు సైతం బుధవారం పురుగుల మందును తాగి ఆసుపత్రి పాలవ్వడం గమనార్హం. అయితే తాతారావుకు తమ సొంతగ్రామం నుంచి బంధువులు ఫోన్ చేసి ఆరా తీయడంతోనే మనస్థాపం చెంది పురుగుల మందు సేవించినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను పోలీసులు విడుదల చేశారు. వివరాలిలా ఉన్నాయి. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి,రాజీవ్‌గాంధీనగర్ ఎదురుగా ఉన్న జయదీపిక ఎస్టేట్స్‌లో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిత్తారపు తాతారావు, అతడి భార్య లక్ష్మి కుటుంబం వాచ్‌మన్‌గా పనిచేస్తున్నారు. జయదీపిక ఎస్టేట్స్‌లోని నిత్యధర హౌస్(ఎన్‌డీ)అపార్ట్‌మెంట్‌లోని జీ-2 ఫ్లాట్‌లో ఇంట్లో పనిమనిషిగా లక్ష్మి పని చేస్తున్నది. అయితే జీ1ఫ్లాట్‌లో పఠాన్ మహబూబ్‌జానీ కుటుంబం నివాసముంటుంది. గత నెల 16వ తేదీన జానీ ఇంటి పని మనిషి రాకపోవడంతో ఇంటి యజమాని(జానీ భార్య) లక్ష్మికి రూ.100 ఇచ్చి ఇంటిని శుభ్రం చేయించుకున్నది. అదే రోజు తన ఇంట్లోని 5 తులాల బంగారు నగలు మాయమవ్వడంతో గత నెల 19వ తేదీన లక్ష్మిపై అనుమానం వ్యక్తం చేస్తూ జానీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో భాగంగా లక్ష్మి ఆడపడుచు సుధ భర్త రాజేశ్ భయంతో పురుగుల మందును సేవించిన విషయం విదితమే.

ఇదిలా ఉండగా.. మంగళవారం రాత్రి ఇదే విషయమై లక్ష్మి భర్తకు ఫోన్ చేసిన సొంత గ్రామస్తులు రాజేశ్ పురుగుల మందును తాగిన విషయమై ఆరా తీశారు. దీంతో మనస్తాపం చెందిన చిత్తారపు తాతారావు సైతం గుర్తు తెలియని పురుగుల మందు రాత్రే సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతన్ని రాజేశ్ చికిత్స పొందుతున్న వైద్యశాలలోనే చేర్పించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. అయితే ఈ ఇద్దరు పురుగుల మందును తాగడానికి పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని చిత్తారపు లక్ష్మి,ఆమె ఆడపడుచు సుధలు వీడియోలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని లక్ష్మి, సుధ బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ ముందు అంగీకరించారని బాచుపల్లి సీఐ ఉపేందర్ స్పష్టం చేశారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 24లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు.

'లా' రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ఆయన పర్యటించి స్థానిక సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేశంగౌడ్, అఫ్జల్, సయ్యద్ నయీమ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, జూలై 3

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌కృష్ణను ఆయన కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. – దుండిగల్, జూలై 3

సీసీరోడ్డు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

గోపన్‌పల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

శేరిలింగంపల్లి, జూలై 3:గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. రూ.1.5 కోట్లతో చేపడుతున్న రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతు నాయక్, తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.